ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 18 సెప్టెంబరు 2025



పెద్దేరుకు 518 క్యూసెక్కుల వరద

- ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్కుల నీరు నదిలోకి విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువన వున్న ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద పోటెత్తింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా బుధవారం సాయంత్రం 518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136. మీటర్లకు చేరింది. దీంతో రాత్రి ఎనిమిది గంటలకు స్పిల్‌వేలో మూడో గేటు తెరిచి 400 క్యూసెక్కుల నీటిని పెద్దేరు నదిలోకి విడిచి పెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచాలి

ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించాలి



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు



హాజరైన వైద్యులు, మహిళలు, విద్యార్థినులు,

- మహిళలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి పరీక్షలు చేయించుకోవాలి
- సికిల్‌సెల్ ఎనీమియా పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
క్యాన్సర్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, వ్యాధి పట్ల నెలకొన్న భయాలు, ఆందోళనలను తొలగించాలని వైద్యులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. బుధవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సాగరిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన వైద్య పరీక్షల స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు, వైద్యులతో మాట్లాడిన ఆయన... మహిళలు ముందుకువచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ పట్ల ఇప్పటికీ అనేక అనుమానాలు, అపోహలు ఉన్నాయని, గతంలో పారిశ్రామిక వేత్తలు దీని బారినపడి బయటకు చెప్పుకు నేందుకు ఇబ్బంది పడ్డారన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా పట్ల కూడా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పెళ్లికి ముహూర్తాలతోపాటు ఎనీమియా సమస్య ఉందా.?, లేదా?...అన్నది నిర్ధారించుకోవాలని సూచించారు. మేనరికపు వివాహాల వల్ల ఈ తరహా సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఒక స్టాల్‌లో చిన్నారికి వ్యాక్సిన్ వేయడం ద్వారా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అలాగే ఎన్‌సీడీ 4.0 హౌస్ హోల్డ్ సర్వే, స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఆరోగ్య డేటా ఆన్‌లైన్ చేయాలని, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాప్తిని అరికట్టాలని, అనువంశిక వ్యాధులు సక్రమించకుండా ముందస్తు ... మిగతా 8వ పేజీలో

మహిళా భద్రతలో విశాఖ టాప్

- వచ్చే నెలలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రెడీ
- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు జీఎంఆర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుసంధానం
- ఆగస్టు నుంచిఇ భోగాపురం విమానాశ్రయంలో ఆపరేషన్స్
- సీఎం నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
మహిళలకు భద్రత కల్పించే నగరంగా విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఒకరోజు పర్యటనకు బుధవారం నగరానికి వచ్చిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'స్వస్థ్ నారీ..సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో, ఆ తరువాత రాడీసన్ బ్లూ హోటల్‌లో సీఐఐ నిర్వహించిన జీసీసీ గ్లోబల్ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రజలు చాలా మంచివారని, మహిళా పారిశ్రామికవేత్తలు కూడా ఇక్కడ ఉన్నారని, వారు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి వచ్చే నెలలోనే గూగుల్ విశాఖపట్నం వస్తుందని ... మిగతా 8వ పేజీలో

అక్రమ లేఅవుట్‌లపై కొరడా



పాయకరావుపేటలో అనధికార లేఅవుట్ వద్ద బోర్డు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ అధికారులు

క్రమబద్ధీకరణకు రియల్టర్ల నుంచి అరకొర స్పందన

- జిల్లాలో 496 అనధికార లేఅవుట్‌లు ఉన్నట్టు నిర్ధారించిన అధికారులు
- ఎల్‌ఆర్‌ఎస్ కోసం నోటీసులు జారీ
- 85 అనధికార లేఅవుట్‌ల వద్ద బోర్డులు ఏర్పాటు
- గడువులోగా స్పందించకపోతే వెంచర్లలో సరిహద్దు రాళ్లు తొలగింపు
- స్థలాల రిజిస్ట్రేషన్లు నిలుపుదల

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా వేసిన అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ రియల్టర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటున్నది. దీంతో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లను గుర్తించి, సంబంధిత సంస్థలు, వ్యక్తులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్ణీత గడువులోగా స్పందించకపోతే అనధికార లేఅవుట్‌ల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



అనకాపల్లి శివారులో పంట పొలాల్లో వేసిన అనధికార లేఅవుట్

జిల్లాలో 744 లేఅవుట్‌లు ఉన్నట్టు వీఎంఆర్‌డీఏ, పంచాయతీ, మునిసిపల్ అధికారులు ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలింది. వీటిలో సగానికిపైగా.. అంటే 496 అనధికార లేఅవుట్‌లుగా గుర్తించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. జాతీయ రహదారికి అనుకొనివున్న అనకాపల్లి, పరవాడ, మునగపాక, కశింకోట, ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో అనధికార లేఅవుట్‌లు ఎక్కువగా వున్నాయి. అత్యధికంగా పాయకరావుపేట మండలంలో 88 అక్రమ లేఅవుట్‌లు వున్నారు. తరువాత సబ్బవరం మండలంలో 86, పరవాడలో 82, రాంబిల్లిలో 44, కె.కోటపాడులో 44, చోడవరంబ 37, అనకాపల్లిలో 21, కశింకోటలో 6, మాకవరపాలెంలో 9, మునగపాకలో 18, నక్కపల్లిలో 16, నర్సీపట్నంలో 13, రావికమతంలో ఒకటి, ఎస్.రాయవరంలో 10, దేవరాపల్లిలో 4, ఎలమంచిలిలో 3, అచ్యుతాపురంలో 5, చీడికాడలో 2, బుచ్చెయ్యపేటలో ఒకటి వున్నాయి. వీటిల్లో ఎక్కువ లేఅవుట్లు వైసీపీ నేతలు, ఆ పార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులకు చెందినవని చెబుతున్నారు. ప్లాట్లు విక్రయించని అనధికార లేఅవుట్లతోపాటు ఇప్పటికే స్థలాలు విక్రయించిన అనధికార లేఅవుట్లపై అధికారులు దృష్టి సారించారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారులు 85 అనధికార లేఅవుట్‌ల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు.

అంతంతమాత్రంగానే స్పందన

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు జూలై 26వ తేదీన ఉత్తర్వులతోపాటు ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీకి ముందు వేసిన లేఅవుట్‌లను ... మిగతా 8వ పేజీలో

వైసీపీ నుంచి టీడీపీలోకి వలస

ఎస్.రాయవరానికి చెందిన బొలిశెట్టితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు చేరిక

- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన హోం మంత్రి అనిత
- 'స్థానిక' ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యమని పిలుపు



హోం మంత్రి అనిత సమక్షంలో టీడీపీలో చేరిన బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైసీపీ నాయకులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
కొద్ది రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన సీనియర్ నేత, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతోపాటు వైసీపీకి చెందిన ప్రస్తుత ఎంపీపీ, ఇద్దరు మాజీ ఎంపీపీలు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైసీపీ నాయకులు బుధవారం విజయవాడలోని ఎస్‌ఎల్‌వీ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఎస్.రాయవరం మండలంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బొలిశెట్టి గోవిందరావుతోపాటు ప్రస్తుత ఎంపీపీ కేశిబోయిన వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీలు బొలిశెట్టి శారదాకుమారి (చినగుమ్ములూరు ఎంపీటీసీ సభ్యురాలు), కోన లోవలక్ష్మి (పెనుగొల్లు ఎంపీటీసీ సభ్యురాలు), వమ్మవరం ఎంపీటీసీ సభ్యుడు బాలం సూరిబాబు, ఎస్.రాయవరం ఎంపీటీసీ ... మిగతా 8వ పేజీలో

జాలారిపేటలో మహిళ దారుణ హత్య

సహజీవనం చేస్తున్న వ్యక్తే అఘాయిత్యం



హత్యకు గురైన లక్ష్మి,



పోలీసుల అదుపులో నిందితుడు కోదండ

పరవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ జాలారిపేటలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తే ఈ దారుణానికి పాల్పడ్డాడు. పాత నేరస్థుడైన ఇతను ప్రస్తుతం బెయిల్‌పై బయట వున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాలారిపేట గ్రామానికి చెందిన వొలిశెట్టి కోదండకు గతంలో విశాఖపట్నంకు చెందిన యువతితో వివాహం కాగా.. ఇతడి వేధింపులు తట్టుకోలేక విడాకులు ఇచ్చింది. తరువాత అచ్యుతాపురం మండలం పూడిమడక ప్రాంతానికి చెందిన మరో యువతిని వివాహం చేసుకున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ ఆమెను హింసించేవాడు. దీంతో వేధింపులు తట్టుకోలేక రెండేళ్ల కుమారైతో కలిసి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో కోదండను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. కొంతకాలం క్రితం బెయిల్‌పై ... మిగతా 8వ పేజీలో

రాచపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు

ఏపీఐఐసీకి చెందిన 290 ఎకరాల్లో ఏర్పాటు

- మరో 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు
- పరిశ్రమల ముఖ్య కార్యదర్శి యువరాజ్ వెల్లడి
- వాక రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశం



రాచపల్లి సర్వే నంబరు 737లో ఉన్న భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్

మాకవరపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని రాచపల్లి రెవెన్యూలో ఏపీఐఐసీకి చెందిన 290 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు, సర్వే నంబరు 737లో వున్న 400 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని రాచపల్లి రెవెన్యూలో ఉన్న ఏపీఐఐసీ భూములతో పాటు సర్వే నంబరు 737లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఇక్కడ మొత్తం ఎంత భూమి వుంది, నిర్వాసిత రైతులకు ఇచ్చే నష్టపరిహారం ఎంత వంటి వివరాలను కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యువరాజ్ మాట్లాడుతూ, ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు కోసం మరో 479 ఎకరాల ప్రభుత్వ భూమిని రెండో విడతలో తీసుకుంటామన్నారు. అనంతరం మాకవరపాలెం నుంచి ఎలమంచిలి సమీపంలోని పెదపల్లి వెళ్లే వాక రోడ్డును, అటవీ భూముల సరిహద్దుల మ్యాప్‌లను పరిశీలించారు. వాక రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్‌కు సూచించారు. కాగా రాచపల్లి గ్రామానికి చెందిన జిరాయితీ భూములను ఏపీఐఐసీ రికార్డుల నుంచి తొలగించి రైతుల పేర్ల మీద ఆన్‌లైన్ చేయాలని ఆర్‌వై పాత్రుడు, జోగిపాత్రుడు, రాంబాబు కోరగా.. నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్‌కు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో వీవీ రమణ, నరీపట్నం, మాకవరపాలెం తహశీల్దార్లు రామారావు, వెంకటరమణ, జిల్లా సర్వే అధికారి గోపాలరాజు, మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, నందకిశోర్, జమీందార్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ పనులు వేగవంతం చేయాలి

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసిత రైతులకు పెదబోదిగల్లం వద్ద చేపట్టిన పునరావాస కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం పెదబోదిగల్లం వద్ద లే అవుట్లను, పునరావాస కాలనీ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలతోపాటు కాలనీకి ... మిగతా 8వ పేజీలో

గోవాడ షుగర్స్ పరిరక్షణకు ఆందోళన ఉధృతం చేస్తాం

- ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణం
- ప్రభుత్వం వెంటనే రూ.35 కోట్లు ఇవ్వాలి
- రైతు సంఘాల నేతలు డిమాండ్



షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్టు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ నిర్వహించడంతోపాటు, చెరకు రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు ఫ్యాక్టరీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ, షుగర్ ఫ్యాక్టరీని కాపాడితీరుతామంటూ గొప్పలు చెప్పిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి కొంతకాలం నుంచి స్పందించకపోవడం దారుణమన్నారు. గత రెండు సీజన్లకు సంబంధించి రైతులకు బకాయిలు, కార్మికుల వేతనాలకు ప్రభుత్వం తక్షణమే రూ.35 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ నాయకులు దండుపాటి తాతారావు మాట్లాడుతూ, గోవాడ ఫ్యాక్టరీ మహాజన సభను ఈనెలాఖరులోగా నిర్వహించి సమస్యలపై చర్చించాలని అన్నారు. సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు

టెర్రస్ పైనుంచి దూకి వైద్య విద్యార్థిని ఆత్మహత్య

- సుజాతనగర్‌లో సంఘటన
- స్వగ్రామం మాకవరపాలెం

పెందుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
చదువులో వెనకబడి పోతున్నాననే మనస్తాపం, బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేయలేననే ఆందోళనతో ఓ వైద్య విద్యార్థిని అపార్ట్‌మెంట్ టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బుధవారం రాత్రి ... మిగతా 8వ పేజీలో



శివాని జ్యోత్స్న మృతదేహం

అమరావతికి మెగా డీఎస్సీ టీచర్లు

- ఉమ్మడి జిల్లా నుంచి 85 బస్సులు
- నక్కపల్లి, అడ్డరోడ్డు, 'పేటల్లో మధ్యాహ్న భోజనాలు
- డీఈవో అప్పారావు నాయుడు వెల్లడి



నక్కపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):
మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు అభినందిస్తారని, ఇందుకోసం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు మూడు వేల మందిని గురువారం అమరావతి తరలించేందుకు 85 బస్సులు ఏర్పాటు చేశామని డీఈవో అప్పారావు నాయుడు చెప్పారు. బుధవారం నక్కపల్లి మండలంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, విజయవాడ వెళ్లే వారిలో వెయ్యి మందికి నక్కపల్లిలో, మరో వెయ్యి మందికి అడ్డరోడ్డులోని ఆదర్శ స్కూల్‌లో, ఇంకో వెయ్యి మందికి పాయకరావుపేటలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించినట్టు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో కె.నరేశ్ వున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

జనసేనలోకి వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హరిపాలెం వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతిర్మయి, ప్రముఖ న్యాయవాది శరగడం అప్పలనాయుడుతో పాటు 200 మంది కార్యకర్తలు బుధవారం జనసేనలో చేరారు. వారికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆయన నివాసంలో కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, కరెడ్ల సూర్యప్రకాశ్, పిన్నమరాజు వాసు, శరగడం జగ్గారావు పాల్గొన్నారు.

లోవపాలేన్ని సందర్శించిన ఆర్డీఓ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆయేషా బేగమ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాంబిల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని జడ్‌చింతువా పంచాయతీ లోవపాలెం గ్రామాన్ని అనకాపల్లి ఆర్డీఓ ఆయేషా బేగమ్, రాంబిల్లి తహశీల్దార్ శ్రీనివాసరావు సందర్శించారు.లోవపాలెంలో వైరల్ జ్వరాలు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వచ్చిన కథనానికి వారు స్పందించారు. గ్రామంలో జ్వరాలు రావడానికి గల కారణాలను స్థానికులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు, వర్షపు నీరు వీధుల్లో, రోడ్లపై నిల్వ ఉండి దోమల వ్యాప్తి వల్ల జ్వరాలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. అలాగే రాంబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

మునగపాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాడ్రాపల్లి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం పందిరి రాట వేశారు. అలాగే చిన రామాలయం వద్ద కూడా కమిటీ సభ్యులు పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, దశావతారం, శేషు, దేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని పర్యవేక్షించండి

▸▸ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని గుడివాడ, తిమ్మాపురం పంచాయతీల్లో బుధవారం ఆమె పర్యటించారు. గుడివాడలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబుతో కలిసి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం తిమ్మాపురం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అనంతరం కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారిం చాలన్నారు. అలాగే సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్‌ను పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

సొసైటీ రుణాలు ముందుగానే చెల్లించాలి



రుణాల గురించి యువరాజ్‌కు వివరిస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందిన రైతుల భూములను ఏపీఐఐసీ రెండో విడత సేకరిస్తే, మొత్తం పరిహారం నుంచి ముందుగా రుణాలను చెల్లించాలని సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి కోరారు. ఈ మేరకు బుధవారం నక్కపల్లిలో పర్యటించిన పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్‌కు వినతిపత్రం అందించారు. నక్కపల్లి సొసైటీ ద్వారా పలు గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది రైతులు రుణాలు తీసుకున్నారని చెప్పారు. సిహెచ్‌ఎల్ పురం, పెదతీనార్ల, చినతీనార్ల, ఉపమాక, జానకయ్యపేట, రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట గ్రామాల్లో రెండో విడత భూ సేకరణ చేస్తే, ముందుగా వారికి నష్ట పరిహారం ఇచ్చే ముందు సొసైటీ రుణాలు మొత్తం చెల్లించాలని కోరారు. లేకపోతే తమ సొసైటీ నష్టపోయే ప్రమాదం వుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.నూకరాజు, జి.లక్ష్మణరావు, సొసైటీ డైరెక్టర్ కోసూరి శ్రీను, సెక్రటరీ శ్రీనివాస్, సిబ్బంది ఖాన్ వున్నారు.

బల్క్‌పార్కును రద్దు చేయాల్సిందే..

▸▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో బుధవారం పాల్గొని సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. చట్ట విరుద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, పోలీసు బలగాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పనులు చేపడుతుండడం అప్రజాస్వామికమన్నారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు హోం మంత్రి అనిత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ; సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేశ్, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, టీడీపీ నేత పిక్కి సత్తియ్య, వైసీపీ నేత ఎరుపల్లి నగేశ్‌పాల్గొన్నారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' ప్రారంభం

పాయకరావుపేట/రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. పాయకరావుపేట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు డి.సుభాష్, వీఎస్.సౌందర్య, కూటమి నాయకులు తోట నగేశ్, పి.చిట్టిబాబు, సిహెచ్.ప్రదీప్, యాళ్ల వరహాల బాబు, ఎం.నారాయణరావు, డి.రాజబాబు, పి.రవిరాజు, ఎన్.పద్మావతి తదితరులు కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే శ్రీరాంపురం పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని డాక్టర్ పి.కావ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, హెచ్‌వీ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయకుమార్



మునగపాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ముఖ్యంగా మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బలంగా ఉంటుందని చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు కంటే ఆరోగ్యం విలువైనదని, కాపాడుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. చాలా మంది వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వైద్య శాఖ ద్వారా కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, క్షయ స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలతో పాటు పలు వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేస్తుందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న ల్యాబ్‌ను పరిశీలించారు. అలాగే చూచుకొండ పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమానికి కూడా ఆయన హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో వైద్యులు ఎన్. విమలగిరి, వై.రామకృష్ణ, సీహెచ్‌వో ఆర్. దేవకాంత, సర్పంచ్ దిమ్మల అప్పారావు, కూటమి నాయకులు టెక్కలి పరశరాం, దాడి ముసిలినాయుడు, ఏవీ సత్యనారాయణ, కాండ్రేగుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉమెన్ ఫ్రెండ్లీ సెంటర్లు

అచ్యుతాపురం : ప్రతి పది కిలోమీటర్లకు ఉమెన్ ఫ్రెండ్లీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన అచ్యుతాపురం పీహెచ్‌సీలో స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు నుంచి పది కిలోమీటర్లకు ఒక ఉమెన్ ఫ్రెండ్లీ సెంటర్‌ను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రయాణాల్లో మల మూత్ర విసర్జనకు ఇబ్బందులు పడుతున్నారని, ఈమేరకు ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



రాంబిల్లిలోని బీజేపీ కార్యాలయంలో వేడుకలు

రాంబిల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాంబిల్లిలోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రాంబిల్లిలోని రామాలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అలాగే పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ వర్మరాజు, మండల అధ్యక్షుడు కారేరాముడు,టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్, మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, బీజేపీ సీనియర్ నాయకులు గిరిరాజు, రాంబిల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎరిపిల్లి చిట్టిబాబు, కూటమి నాయకులు సత్యనారాయణ, ఉమ్మిడి నగేశ్, రావి దేముళ్ళు, ధర్మాల గోవిందరెడ్డి, ధర్మతేజ, డి. రమేశ్, సూరాడ నూకరాజు పాల్గొన్నారు.

బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

ఎలమంచిలి : మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ములకలాపల్లి మైహోమ్ సిమెంటు పరిశ్రమ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు పరిశ్రమ యూనిట్ హెడ్ బి. రామస్వామి తెలిపారు. ములకలాపల్లి, మన్యంపాలెం ప్రభుత్వ పాఠశాలవిద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ట్రక్ డ్రైవర్లకు హెచ్ఐవీ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ డీజీఎం ఎల్. శ్రీనివాసరావు,ఓహెచ్‌సీ ఇన్‌చార్జి బి.రాజు, పరిశ్రమ కన్సల్టెంట్ సాంబమూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం : స్థానిక బీజేపీ కార్యాయంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి వెంకటస్వామి నాయుడు, హీముని జోగినాయుడు, బండారు నాయుడుబాబు, చిన్ని రమణ పాల్గొన్నారు.

మునగపాకలో..

మునగపాక : స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బీజేపీ నాయకులు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాశేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో విశ్వకర్మ జయంతి



మునగపాకలో విశ్వకర్మ విగ్రహం ఊరేగింపు

మునగపాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మునగపాకలో విశ్వకర్మ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక కామాక్షి విశ్వ బ్రాహ్మణ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, తరువాత పురవీధుల్లో ఊరేగించారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివకోటి సత్యనారాయణ (బాబు), మహేశ్, కొత్తల సత్యనారాయణ, గోవింద్, శ్రీను, అప్పలాచారి పాల్గొన్నారు.

ఎలమంచిలి : పట్టణంలోని పలు ప్రాంతాల్లో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కామాక్షి అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చేతివృత్తుల వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి గంగాధర్, టిడ్కో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశాలకు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

మండల సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం



సమావేశంలో తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సీతబాబు

కోటవురట్ల, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలోనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమవతి మాట్లాడుతుండగా వైస్ ఎంపీపీ సాగి సీతబాబు అడ్డు తగిలారు. తమ పదవీ కాలం ఐదేళ్లు ముగిసే దశకు వచ్చినా నక్కపల్లి ప్రాజెక్టు సీడీపీవో ఒకసారి సమావేశాలకు రాలేదని, ఆమె ఎలా ఉంటారో చూడానికైనా ఫొటో ఉంటే చూపించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పందూరు, చౌడువాడ సర్పంచులు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ మండిపడ్డారు. అధికారులు రాలేనప్పుడు సమావేశాలు నిర్వహించడం దేనికని ప్రశ్నించారు. చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో 120 మంది విద్యార్థులు నర్సీపట్నంలో ఉన్నత చదువు కోసం వెళ్తున్నారని, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక వారంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. వైస్ ఎంపీపీ సీతబాబు మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డులో నిలిచిపోయి వర్షపు నీటిని కార్యాలయంలోకి ఎలా మళ్లిస్తారంటూ తహశీల్దార్ తిరుమలబాబును ప్రశ్నించారు. ఇంతలో బీకేపల్లి సర్పంచ్ పెట్లలింగంనాయుడు జోక్యం చేసుకొని మెయిన్‌రోడ్డు వర్షపు నీటి సమస్య పరిష్కారానికి మంత్రి అనిత రూ.16 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యానవన శాఖ ఏవో సాయిప్రియ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, మండల ఏఈ వర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలి

డాక్టర్ కృష్ణ చరణానంద భారతీ స్వామి

ఘనంగా ప్రజా చైతన్య యాత్ర, సనాతన ధర్మ మహాసభ



పాయకరావుపేటలో చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సనాతన సంప్రదాయం, హిందూ ధర్మాన్ని పాటించే భారతదేశంలో గోవులను రక్షించేందుకు గో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు, యాజ్ఞవల్క్య రాజాశ్రమం పీఠాధిపతులు డాక్టర్ కృష్ణ చరణానంద భారతీస్వామి కోరారు. పాయకరావుపేటలో పాండురంగస్వామి ఆలయం నుంచి వై జంక్షన్ వరకు బుధవారం ప్రజా చైతన్య యాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక జగతా అప్పారావు కల్యాణ మండపంలో నిర్వహించిన సనాతన ధర్మ మహాసభలో జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రధానంగా ఐదు డిమాండ్లు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. గోవధ నిషేధ చట్టాల్ని పటిష్టంగా అమలుచేయడంతో పాటు గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలన్నారు. దేశవ్యాప్తంగా సంస్కృత విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేసి, భగవద్గీతను పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడంతో పాటు ఆక్రమణల పాలైన మాణ్యాలు, భూములు తిరిగి దేవాలయాలకు అప్పగించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి, గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్వామీజీలు సత్యానందగిరి, దివ్యానంద సరస్వతి, కృష్ణానంద, కృష్ణస్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నాయకులు పి.చిట్టిబాబు, సిహెచ్.ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, ఎం.నారాయణరావు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీహరిరాజు, భరత్, రామాల శివనాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పాయకరావుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవాన్ విశ్వకర్మ జయంతిని పాయకరావుపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మొల్లేటి చంటి వర్కుషాపులో కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం, ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ అమరావతి ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భగవాన్ విశ్వకర్మ, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, చించెలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పెదపూడి నరసింహమూర్తి, మొల్లేటి నారాయణరావు, రామోజు నాగేశ్వరరావు, కొప్పోజు శ్రీను, కొత్తల శ్రీను, దివిలి నాగభూషణం, వరహాలబాబు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయకుమార్ 250 వినతులు స్వీకరించారు. అర్జీ లను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర ప్రతినిధి సతీశ్, నాయకులు బొద్దపు శ్రీను, పిట్టా శ్రీను, ఊటకూటి రమేశ్, కొఠారు శ్రీను పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో పి.విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని హాజరుకావాలని ఆమె కోరారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని కోర్పుపేట బుజ్జి కూరగాయల దుకాణం సమీపంలో ఈనెల 21న జరిగే రక్తదాన శిబిరం, మొక్కల పంపిణీ కార్యక్రమాల పోస్టర్‌ను ఎమ్మెల్యే విజయకుమార్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాల నిర్వాహకుడు గొలుసుపూడి శ్రీనివాస బుజ్జిని అభినందించారు. సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బుజ్జి, శ్యామల ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరాన్ని యువత విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

రాజుకోడూరులో 'పొలం పిలుస్తోంది'

రాంబిల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుకోడూరు, హరిపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ సి. సుమంత మాట్లాడుతూ మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 5653 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 4846 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 298 టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



అప్పారాయుడుపాలెంలో కార్డులు పంపిణీ చేస్తున్న దిన్‌బాబు

రాంబిల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచదార్ల, అప్పారాయుడుపాలెం, భోగాపురం, పెదకలవలాపల్లిలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి. దిన్‌బాబు కార్డుదారులకు బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పారాయుడుపాలెం మాజీ సర్పంచ్ రామారావు, మిల్క్ సొసైటీ ప్రెసిడెంట్ కృష్ణ, పెదవలాపల్లి మాజీ సర్పంచ్ కర్రిసింహగిరి ప్రసాద్, వైలో మాజీ సర్పంచ్ బద్ది నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి : మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో కూటమి నాయకులు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. 20వ వార్డులో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటస్వామి, బీజేపీ నాయకులు ఈశ్వరరావు, శ్రీను, 21వ వార్డులోని మంత్రిపాలెం, గొల్లలపాలెంలో తెలుగు యువత అధ్యక్షుడు నమ్మి రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.

అచ్యుతాపురం :ఖాజీపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే వెదురువాడలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, రామన్నపాలెంలో సర్పంచ్ డ్రీమ్స్‌నాయుడు, రాజానపాలెం, దోసూరు గ్రామాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు కార్డులు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో రాజాన నానాజీ, పీలా సందీప్, ధర్మిరెడ్డి అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సన్యాసినాయుడు, రమణ, నాగ శ్రీను, సత్యారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

జీవన ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వండి

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా జీవన ఎరువులకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. మండలంలోని కాగిత, గునిపూడి గ్రామాల్లో బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ జీవన ఎరువులను ఎకరానికి 500 మిల్లీలీటర్లు చొప్పున చివికిన పశువుల ఎరువుల్లో కలిపి చల్లాలని చెప్పారు. జీవన ఎరువుల ద్వారా పంట దిగుబడులు పది నుంచి 15 శాతం పెంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

నక్కపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఎంపీడీవో డి.సీతారామరాజు హెచ్చరించారు. దేవవరం సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావుతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సూచించారు. అలాగే శానిటేషన్ పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు ఆదేశించారు. సర్పంచ్ రాఘవకుమారి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకారం

పాయకరావుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా పి.విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎస్.రాయవరం ఎంపీడీవోగా మీనాకుమారి

ఎస్. రాయవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో పి.మీనాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పద్మనాభంలో డిప్యూటీ ఎంపీడీవో పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీవోకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పూర్తి స్థాయిలో యూరియా పంపిణీ



పాయకరావుపేటలో ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట/కోటవురట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రైతులకు అవసరమైన యూరియాను పూర్తి స్థాయిలో అందిస్తున్నామని పాయకరావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు తెలిపారు. పీఏసీఎస్ ఆవరణలో బుధవారం రైతులకు రెండో విడత యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 12 టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇపుడు మరో 12 టన్నులు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.చిట్టిబాబు, సిహెచ్.ప్రదీప్, వై.వరహాలబాబు, ఎం.నారాయణరావు, కాశీవిశ్వనాథం పాల్గొన్నారు. అలాగే కోటవురట్ల పీఏసీఎస్‌లో బుధవారం ఎరువుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్‌పర్సన్ జనార్ధన్ మాట్లాడుతూ 12 టన్నుల ఎరువులను పంపిణీ చేస్తున్నామని, రెండో విడతలో మరో 18 టన్నులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లింగంనాయుడు, మాజీ అధ్యక్షుడు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు పాల్గొన్నారు.



కోటవురట్ల పీఏసీఎస్‌లో ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ తరగతులు

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు బుధవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో కోర్సులు పూర్తి చేసి, ఉన్నతమైన ప్లేస్‌మెంట్‌లను పొందాలని చెప్పారు. మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల అభ్య ర్థులు కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌ను సంప్రతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, స్కిల్ హబ్ సమన్వయకర్త చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సరస్వతి విద్యాలయంలో అనకాపల్లి జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి రవి, ఉపాధ్యక్షులుగా వేగి వీరునాయుడు, వసంత, కార్యదర్శిగా ఎస్. అన్నారావు, జాయింట్ సెక్రటరీగా సుమన్, అడిషినల్ సెక్రటరీగా చిరంజీవి, కోశాధికారిగా ఆర్. దేవుడు బాబు ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రామరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

తాగునీరు సరఫరా చేయాలని ఆందోళన



పంచాయతీ కార్యదర్శి తరుణశ్రీకి వినతిపత్రం ఇస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారికి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం మాట్లాడుతూ ట్యాంకర్లతో నీరు సరఫరా చేయకపోవడంతో టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు బురదమయం కావడంతో ఆ నీరు తాగడం వల్ల జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా... పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కాలనీకి ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి తరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఎం. బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, గొంప సీత, కె. లక్ష్మి, వి. సరోజిని, ఆర్. రమణమ్మ, సీతమ్మ, అబద్ధం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ జి. రామచంద్రరావు సూచించారు. ఆరిపాక ఉన్నత పాఠశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల మానసిక, శారీరక సమస్యలతో పాటు ప్రాణ హాని కూడా జరిగే అవకాశం ఉందన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే యువత రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



సాగర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ

సబ్బవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం 10వ తరగతి విద్యార్థి పి.సాగర్ జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా మండపల్లిలో ఈ నెల 12,13 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పి.సాగర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వచ్చేనెల 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. అనంతరం సాగర్‌ను ఘనంగా సత్కరించారు. సాగర్‌ను రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ సెక్రటరీ కేఎస్‌వీ సత్యనారాయణ, పీఈటీ, పీడీలు సీఎల్ఎన్ ప్రసాద్, వి.సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి, ఉపాధ్యాయులు అభినందించారు.

కోడి పందాలు వేస్తున్న ఆరుగురి అరెస్టు



పోలీసులు అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లు

కశింకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత కన్నూరు పాలెంలో కోడి పందాలు ఆడుతున్న ఆరుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ అల్లు స్వామినాయుడుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందితో కలిసి కోడి పందాల స్థావరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.5,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి



ఊరేగింపును ప్రారంభిస్తున్న రాజేంద్ర



విశ్వకర్మ చిత్రపటం వద్ద బీఎంఎస్ నాయకుల నివాళి

విశ్వకర్మ సేవలు ఆదర్శనీయం

- యువత ఆయన బాటలో నడవాలి
- జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి
- ఘనంగా విశ్వకర్మ జయంతి

అనకాపల్లి కలెక్టరేట్,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విరాట్ విశ్వకర్మ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జేసీ జాహ్నవి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జేసీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. ముఖ్యంగా కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప కంచరీ వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా కృషి చేశారని కొనియాడారు. ప్రపంచ తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మను పూజించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వై. సత్యనారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కె. శ్రీదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్, సూపరింటెండెంట్లు, ఏపీ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ విగ్రహం ఊరేగింపు

అనకాపల్లి టౌన్ : కామాక్షిదేవి ఆలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఉత్సవమూర్తికి కోరుకొండ వెంకటరావు, నూకేశ్వరి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై విశ్వకర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఊరేగించారు. విజయ రామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకూ ఊరేగింపు సాగింది. తరువాత కామాక్షి కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అక్కడి నుంచి రథోత్సవం తిరిగి నిదానందొడ్డిలోని కామాక్షి అమ్మవారి ఆలయానికి చేరుకుంది.ఈ కార్యక్రమంలో అనకాపల్లి బంగారం వర్తకుల సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, పొన్నాడ పెదబాబు, యండపల్లి మోహన్ బ్రహ్మజీ, కిల్లాడ శ్రీనివాసరావు, వెదురుపాటి బాబి , తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ప్లాంట్ మెయిన్ గేటు వద్ద విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత పలువురు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు బి. రమణ, కె. సత్యనారాయణ, జి. నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు. అలాగే పరవాడలో వీరబ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం ఆధ్వర్యంలోనూ విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి ప్రసాద్, సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామునాయుడు, పైలా సన్యాసిరావు, చిన అక్కునాయుడు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తాం

జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట సమీపంలో ఉన్న ఏఎంసీ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి తెలిపారు. సోమవారం కాలనీవాసులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి సమస్యలను వివరించడంతో ఆయన కాలనీని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్సీని ఆదేశించారు. ఈమేరకు జడ్సీ బుధవారం కాలనీలోని అన్ని ప్రాంతాలను సందర్శించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిట్ల రాజు, ఎస్. భానుచందర్, మంగ ఈశ్వరరావు, షేక్ రియాజ్, కొణతాల గణేశ్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి



పరవాడ : మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి



కశింకోట : కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి తిరుపతిరావు

మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్‌లో డీఎంహెచ్ఓ హైమావతి

పరవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 13 ఏళ్ల దాటిన మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని, ఈ అవకాశాన్ని మహిళలతో పాటు 13 ఏళ్ల దాటిన వారు సద్వినియోగం చేకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రంజిత్, పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు హారిక, జయశ్రీ కరిష్మా, కనక అప్పారావు, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

సబ్బవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాకంగా చేపట్టిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ - శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. గుల్లేపల్లిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల్లో ఉన్న అనేక అనారోగ్య సమస్యలను ముందుగా గుర్తించి అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలు, వృద్ధులు, గర్భిణిలు, బాలింతలకు వచ్చే పలు అనా రోగ్య సమస్యలను గుర్తించి, చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జరుగుతుందన్నారు. అనంతరం పౌష్టికాహారం ఆవశ్యకత, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ, డాక్టర్ డి. ధమయంతి, ఎంపీహెచ్‌వో ఆర్ఎం నాయుడు, గ్రామ పెద్దలు బండారు శ్రీను, గజ్జి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

అనకాపల్లి టౌన్ : స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్ఆర్ శంకరన్ భవనం వద్ద బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. ఆయుర్వేదిక్ వైద్యులు లావణ్య రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేయడంతో పాటు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయం ఆధ్వర్యంలో కూడా శంకరన్ భవనం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



సబ్బవరం : అమృతపురంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఎంపీ సీఎం రమేశ్ క్యాంపు కార్యాలయంలో రక్తదానం చేస్తున్న యువకులు

దేశాభివృద్ధిలో మోదీ పాత్ర కీలకం

ప్రధాని జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు

కశింకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలుచోట్ల దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కశింకోట పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడారి ఆనంద్ కుమార్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పలకా రవి, పి. అప్పారావు, ఎస్. సన్యాసిరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బంది మహిళలకు, గర్భిణిలకు, కిశోర బాలికలకు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : అమృతపురంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా చింతగట్ల అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే మొక్కలు నాటారు. పార్టీ సీనియర్ నాయకుడు సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెందుర్తి ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గొంప నరసింగరావు, నాగల వెంకటలక్ష్మి, వనం సత్యనారాయణ, బుర్రి శ్రీనివాస్, గండి సత్యంనాయుడు, గల్లా శ్రీను పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

కొత్తూరు : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా జాతీయ రహదారిలో ఉన్న ఎంపీ సీఎం రమేశ్ కార్యాలయంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ ఆధ్వర్యంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు, పలకా రవి, జిల్లా కార్యవర్గసభ్యులు, మండల అధ్యక్షులు, కూటమి నాయకులు, ఎంపీ కార్యాలయం ఇన్‌చార్జి విజయ్ నాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి విశాఖ జిల్లా రైఫిల్ షూటింగ్, వుషు ఎంపిక పోటీలు

పరవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 విభాగాల్లో రైఫిల్ షూటింగ్, వుషు క్రీడా ఎంపిక పోటీలు బుధవారం స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించారు. పోటీలను గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె. నిశాంత్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖజిల్లా నలుమూలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ కేఎం నాయుడు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ మాజీ సెక్రటరీ వి.నాగేశ్వరరావు, కోచ్‌లు రామ్మోహన్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కార్డులు అందిస్తున్న నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

కశింకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గినపాలెం సచివాలయం వద్ద 200 మందికి కూటమి నాయకులు బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలగ సోమేశ్వరరావు,గోవింద, శ్రీనివాసరావు, కరణం గోవింద, రమణ, నాగభూషణం, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కలగ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డీఎస్సీ అభ్యర్థులకు సత్కారం



లక్ష్మీ, ధనుషాను సత్కరించిన గ్రామ పెద్దలు

సబ్బవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోపాల్ నగర్‌లో డీఎస్సీ ఉద్యోగాలు పొందిన కడుపుకుట్ల లక్ష్మీ, పల్ల ధనుషాను గ్రామపెద్దలు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ పల్ల తాతారావు మాట్లాడుతూ ఇద్దరు మహిళలు ఒకేసారి టీచర్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. వారిని నిరుద్యోగ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్ల సన్యాశిరావు, ఉపాధ్యాయులు కె. అశోక్, కె. ప్రసాద్, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు వంశీ, పాల్గొన్నారు.

వైసీపీ నిరసన రేపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీల విధానంలోకి మార్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అదీప్ రాజ్, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు రింగు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నర్సీపట్నంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

120 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పరవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా అనిత ఆప్టికల్స్, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరవాడలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 120 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూండ్రపు సోమునాయుడు, బొడ్డి కోటిబాబు, అనిత ఆప్టికల్స్ ప్రతినిధి గోపి, సోమునాయుడు, బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చేపల బజార్ సమీపంలోని పిళ్లావారివీధి జంక్షన్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పిళ్లా దుర్గానందం, సిరసపల్లి సూరిబాబు, సిరసపల్లి ఆదిబాబు, సిరసపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ మండపంలో..

అనకాపల్లి టౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ మండపంలో శరన్నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. గతేడాది మాదిరిగానే ఈసారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని భరణికంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం ముహూర్తపు రాట వేశారు. తొలుత వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మాజీ సర్పంచ్ బొండా తాతారావు, రామలక్ష్మి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి. నీలకంఠస్వామి, బొండా నరసింహారావు, బొండా కొండలరావు, బొండా నాని, మునాసాల కోటి, ఎస్. శ్రీను, బి. తరుణ్, బి. నాగార్జున, రాజు, పాల్గొన్నారు.

బయ్యవరం గ్రామాన్ని సందర్శించిన డీజీపీవో సందీప్



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీజీపీవో సందీప్

కశింకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామాన్ని జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఇ. సందీప్ బుధవారం సందర్శించారు. గ్రామంలో తాగునీటి ట్యాంకులను, పైపులైన్లను పరిశీలించారు. పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలను సురక్షితమైన నీరు సరఫరా చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో తోటారావు, సిబ్బంది ఉన్నారు.



హుకుంపేటలో డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న వైద్య సిబ్బంది



మంగబందలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న అడిషనల్ డీఎంహెచ్‌వో ప్రతాప్, వైద్య సిబ్బంది

స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

» మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలు

హుకుంపేట సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి); ప్రభుత్వం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా మహిళలకు ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నట్టు డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలు అంగన్‌వాడీల్లో వైద్యాధికారి జి. సౌజన్య ఈ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధి లక్షణాల ఆధారంగా ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్యకార్డులు అందజేస్తోందన్నారు. గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు, రక్త హీనత పరీక్షలు చేస్తున్నామన్నారు. వీరికి మాతా శిశువు కార్డులు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. సోభకోటలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ శశిభూషణ, ప్రోగ్రాం అధికారి కమలాకర్, సూర్యనారాయణ, సింహాద్రి, వైద్యాధికారి భార్గవి, శ్రీలత, సాంబమూర్తి పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎస్‌కే ఖాదర్ మస్తాన్ వల్లీ, హోమియో వైద్యాధికారి బి. శృజనారాయ్ ఆధ్వర్యంలో 153 మంది మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహించారు. మందులను పం పిణీ చేశారు. ఆ రోగ్య పర్యవేక్షకుడు ఎన్. త్రినాధ్, ఎంపీటీసీ సభ్యుడు పి. సాంబమూర్తి, సచివాలయం సిబ్బంది, టీబీ సూపర్‌వైజర్ జి. అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కిల్లోగుడ పీహెచ్‌సీ పరిధిలో అరకు సచివాలయంలో వైద్యాధికారి నజీబ్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం డీఎంవో కమల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. వైద్యాధికారి కుమార్ రత్న, ఎంపీపీ ఈశ్వరీ, జడ్పీటీసీ సభ్యులు జానకమ్మ, సర్పంచ్ శారద, సాగర ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, పీహెచ్‌వో జానకి, పద్మ, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకరరావు, స్వామి. తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మహిళలు, యువతులు, బాలికలు ఆరోగ్య పరిరక్షణకు నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగ పరుచుకోవాలని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ కోరారు. బుధవారం పీహెచ్‌సీలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరంను ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలలో 16 రోజులపాటు ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, సీడీపీవో, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పీహెచ్‌సీలోని వైద్యాధికారిణి మంజుభార్గవి, రాకేశ్, గుమ్మకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూప్, నాయుడు, పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రూప్‌చంద్ ఆ ధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌నిర్వహించారు. మహిళలకు వి వి ధ వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ పాగి అప్పారావు, పీహెచ్‌ఎన్ పి.వెంకటలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో రాజారావు, హెచ్‌వీ డి.లక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, హెచ్‌వీ సావిత్రి, హెచ్‌ఎస్.రామకృష్ణ, నాయుడు, రామరాజు, దాలన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్వస్థ నారీ సశక్త్ పరివార్ ప్రాజెక్టు నిర్వహణ అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌వో టి. ప్రతాప్ అన్నారు. బుధవారం గంపరాయి సచివాలయం పరిధి మంగబందలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలలో ఉన్న రక్త హీనత, కౌమర దశలో ఉన్న బాలికల రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహనకు ఈ శిబిరాలు ఉపయోగపడతామన్నారు. డీపీహెచ్ ఎన్‌వో భూలోకం, పెదబయలు పీహెచ్‌సీ వైద్యులు నిఖిల్, సిబ్బంది కృష్ణకుమారి, పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా గెమ్మెలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సొలభం పంచాయతీ మధురుమామిడి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి చంద్ర తెలిపారు. 87 మందికి 5రకాల స్ర్కీనింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు చెప్పారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ లబ్బూరులో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పీఎం జీవన్‌జ్యోతి పరిహారం పంపిణీ



బాధితకుటుంబ సభ్యులకు చెక్‌ను అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఎల్‌డీఎం

పాడేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సహజమరణం పొందిన ముగ్గురికి చెందిన మూడు కుటుంబాలకు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా పరిహారాన్ని బుధవారం కలెక్టర్ దినేశ్‌కుమార్ అందించారు. హుకుంపేట మండలం ఆమూరు గ్రామానికి చెందిన పాంగి రాధ, ఓలుబెడ్డ గ్రామానికి చెందిన పాంగి సొన్ను, సిందిపుట్టుకు చెందిన జె.గంగాభవాని సహజమరణం పొందారు. అయితే, ఈ కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉండడంతోపాటు వారికి పీఎం జీవన్ జ్యోతి బీమా సదుపాయం ఉంది. దీంతో ఒక్కొక్క మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం మంజూరైంది. కుటుంబ సభ్యులకు చెక్‌ల రూపంలో జిల్లా కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం మాతునాయుడు, యూబీఐ మేనేజర్ డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో నాణ్యమైన విద్యాబోధన: ఏపీసీ

చింతపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యా బోధనను అందిస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) వి. స్వామి నాయుడు అన్నారు. బుధవారం తాజంగి కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థినుల విద్యా ప్రగతి, ఎఫ్ఏ-1 బుక్‌లెట్ సవరణలను సమీక్షించారు. ఈసందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థినీ విద్యలో రాణించేందుకు (పీఏఎల్) బోధన అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ కోటి సుమమాధురి పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు: డీఈవో



ఉపాధ్యాయులను సమీక్షిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

చింతపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని డీఈవో పి. బ్రహ్మాజీ రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమయపాలనపై సమీక్షించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉదయం తొమ్మిది గంటలకు ముందు పాఠశాలకు హాజరుకావాలన్నారు. ప్రతి ఒకరు విధిగా ఆన్‌లైన్‌లో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యలో రాణించేందుకు బోధనా నైపుణ్యాలు మెరుగుపడాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 400 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1,2 పీబీవీవీ ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు, గ్రేడ్-2 హెచ్‌ఎం జె.లక్ష్మణ్‌కుమార్, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం యూఏ నరసింగరావు పాల్గొన్నారు.

రోడ్డు పూర్తి చేయాలని నిరసన



రైవాడ జలాశయంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు..

అనంతగిరి, సెప్టెంబరు 17 (ఆం ధ్ర జ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ రైవాడ జలాశయం ఆనుకుని ఉన్న సోల బొంగు, కొత్తబూరగ గ్రామ గిరిజనులు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సోలుబొంగులో 13 మంది విద్యార్థులు నాటుపడవపై ప్రయాణించి, దేవరాపల్లి మండలం తామరబ్బ ఎంపీపీ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ స్థితిలో అధికారులు కొద్దిరోజులకింద దేవరాపల్లి మండలం వీరభద్రపేట నుంచి సోలబొంగు, కొత్తబూరగకు గల 6 కిలో మీటర్ల రోడ్డుకు రూ. 3.6 కోట్లను మంజూరు చేసి, పనులు ప్రారంభించారని తర్వాత అటవీశాఖ అనుమతులు లేవని పనులునిలిపివేశారంటూవారు వాపోయారు.

తాగునీటిని అందించండి



ఊట నీటి సేకరిస్తున్న రాసగుప్ప గ్రామస్థులు

పెదబయలు, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండలం కుంతుర్ల పంచాయతీ రాసగుప్ప గ్రామంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఇళ్లున్న తమ గ్రామంలో సురక్షిత తాగు నీరందక ఇబ్బంది ఎదుర్కొన్నామన్నారు. ఊట నీటిని తాగుతున్నామన్నారు. బాబూజీ, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సూర్యకాంతం, కాంతమ్మ పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి'



మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల: పార్టీని క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశించారు. పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు ఆధ్వర్యంలో బుధవారం జడ్పీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ ఎల్.అప్పలరాజు, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థికి గాయాలు

జి.మాడుగుల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏకలవ్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పాంగి వినయ్‌కుమార్ అనే కారు ఢీకొనడంతో కాలికి గాయమైంది బుధవారం ఉదయం అల్పాహారం తిన్న తరువాత ఎదురుగా ఉన్న రోడ్డుపై వచ్చాడు. అంతలో అటుగా వస్తున్న కారు విద్యార్థిపై ఢీకొంది. గాయపడిన బాలుడిని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చింతపల్లి ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



పాలకవర్గంతో ప్రమాణం చేయిస్తున్న టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏఎంసీ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం మార్కెట్ యార్డులో టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నూతనంగా నియమితులైన చైర్‌పర్సన్ ఊర్మిళ, వైస్ చైర్మన్ హశ్వంత్, డైరెక్టర్లుగా పెదిరెడ్ల బేతాళుడు, సేవా ఈశ్వరమ్మ, కినిబెరి వరలక్ష్మి, టోకలగొల్లి దేవి, గర్రంగి రాజేశ్వరి, మొట్టడం శరభన్న, చిందాడ అప్పారావు, చిటికెల కమల, నంబారి సత్యవతి, కిముడు కృష్ణమూర్తి, బౌడు ప్రమీల, నాతిరెడ్డి చెన్నకేశ్వరనాయుడు, బండారు సాంబమూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి గెమ్మెలి అబ్బాయినాయుడు, చౌడుపల్లి సర్పంచ్ లలితలతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పాడేరు ఏపీపీసీఎస్ చైర్‌పర్సన్ డి. వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ బొర్ర విజయరాణి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, లోతుగెడ్డ, లగిసపల్లి సర్పంచ్‌లు చింతర్ల సునీల్, లకే పార్వతి, టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, సోమేశ్, కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సూపర్ సిక్స్ సక్సెస్: ఇన్‌చార్జి ఈశ్వరి

చింతపల్లి: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తొలుత నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, వైపస్ చైర్మన్ రొబ్బ హశ్వంత్‌తోపాటూ డైరెక్టర్లను ఆమె ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తలకు అధిష్ఠానం సుముచిత స్థానం కల్పిస్తుందన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.అనంతరం మార్కెట్ యార్డు నుంచి జాతీయ రహదారి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గిడ్డి ఈశ్వరి గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేసి అలరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కొయ్యూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో విధులు చేపట్టి గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఆమె స్థానిక మండల పరిషత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాల మురళీ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులతో సమీక్షాసమావేశం నిర్వహించి గ్రామాల అభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారు. అనం తరం జడ్పీ చైర్‌పర్సన్ విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 19న వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసనగా పాడేరులో ఆందోళన చేపట్టనున్నామన్నారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న చింతపల్లి జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గాడి నాగమణిలను పరామర్శించారు. మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ స్వాతీరాణి, ఎంపీపీ రమేశ్‌బాబు, జడ్పీటీసీ నూకరాజు, చింతపల్లి ఎంపీపీ బి. అప్పారావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవీధిలో ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జన ఊరేగింపు సమయంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర గణేశ్ ఉత్సవ కమిటీ తరఫున సమకూర్చిన నగదును స్థానిక బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అందజేశారు. ప్రమాదంలో మృతి చెందిన కొర్రా సీతారాం, గుంట కొండబాబు, వంతాల డాలిమ్మ కుటుంబాలకురూ. 50 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు సాయమందేలా ప్రయత్నిస్తానన్నారు. విశాఖ జిల్లా గణేశ్ ఉత్సవ్ కమిటీ అ ధ్యక్షుడు నరేంద్రనాథ్ చౌదరి, రామయ్య, అప్పారావు, జిల్లా సంపర్క ప్రముఖ్ బాబూరావు, నాయకులు మఠం శాంత కుమారి, పాంగి రాజారావు, డాక్టర్.రాఘవేంద్ర, కె.కృష్ణారావు, వేమనబాబు, లకే భాస్కర్, కుడుముల వెం కటరమణ ఉన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు, ప్రోత్సాహకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 17 (ఆం ధ్ర జ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకులు, సేవా పక్వాడా జిల్లా కన్వీనర్ పెనుమాక రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక కాఫీ హౌస్‌లో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి ప్రారంభించారు. అనంతరం 32 మంది రక్త దాతలనుంచి 32 యూనిట్‌ల రక్తాన్ని సేకరించారు. రకదాతలకుఉ చైతన్య చారిటబుల్ ట్రస్ట్ వారు ప్రోత్సాహక బహుమతులందించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, పాంగి రాజారావు, కూడా కృష్ణారావు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఇబ్రహీమ్ భాషా, నూర్ భాషా, కూటమినాయకులు టీడీపీ నేత బొర్రా నాగరాజు, జనసేననాయకులు వంపూరు గంగులయ్య, పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో మార్కెట్ సెంటర్ బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కారే అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీటీసీ సాంబమూర్తి, వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ, హోమియో వైద్యాధికారి సృజనారాయ్, కూటమి నాయకులు బాలకృష్ణ, కాంగ్రెస్ నేత శ్రీనివాస్, నక్కా బాల, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ధారకొండలో మోదీ పుట్టిన వేడుకలు జరిగాయి.

కొయ్యూరు: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు శరభన్నపాలెం బాలుర ఆశ్రమ పా ఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. నాయకులు కేక్‌లను కట్ చేసి స్వీట్లు పంచారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు.స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, నేతలు మత్యారావు, నాగభూషణం, బి.సిబ్బో, నారాయణ,నాగేశ్వరరావుఉన్నారు.

విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ పూజల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

పాడేరురూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాడేరులో భగవాన్ ఆది విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భగవాన్ ఆది విశ్వకర్మ జయంతి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే, పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, స్వర్ణకారులు, కార్పెంటర్స్, కమిటీ ప్రతినిధులు సున్నం సత్యనారాయణ, కొమ్మోజీ వెంకట రమణ, బి.కె. జియారాణి, శ్రీశైలపు ప్రసాద్, శ్రీశైలపు నా నాజీ, నవర గోవిందరావు, దిమిలి వెంకటరమణ, పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి ఎన్ఐటీలో సీటు



ఎన్ఐటీ రాయపూర్‌లో సీటు సాధించిన విద్యార్థి ప్రవీణ్

చింతపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడబ్ల్యూ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన గిరిజన విద్యార్థి ఎన్ఐటీలో సీటు సాధించినట్టు ప్రిన్సిపాల్ కేవీ రామ స్వామి తెలిపారు. చింతపల్లి మండలం వంతమామిడికి చెందిన బొబ్బిలి ప్రవీణ్ కళాశాలలో 2023-25లో ఎంపీసీ గ్రూప్‌లో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్నాడన్నారు. విద్యార్థి కేవలం కళాశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన కోచింగ్ ఆధారంగా జేఈఈ మెయిన్స్‌లో రాణించాడన్నారు. ప్రవీణ్‌కి రాయపూర్ ఎన్ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడన్నారు.

వైభవంగా గజ్జెల పూజా మహోత్సవం



గజ్జెల పూజోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

పాడేరురూరల్, సెప్టెంబరు 17 (ఆ ధ్రజ్యోతి): పాడేరులోని ఉమానీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో బుధవారం గజ్జెల పూజోత్సవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో పాడేరులో భరత నాట్యం శిక్షణ పొందుతున్న చిన్నారులకు నాట్య గురువు చైతన్య ప్రభు ఆశీస్సులతో తొలిసారిగా కాళ్లకు గజ్జెలు కట్టుకునే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చీపురు రమాదేవి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అర్చకులు శ్రీరామం పంతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, ఉప్పల వెంకటరత్నం, వైదేహి, బీవీఎస్.ముకుందరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిర్లక్ష్యం: యూటీఎఫ్

అనంతగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలగెడ్డ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఉపాధ్యాయ సమస్యలపై పర్యటిస్తున్న రణభేరి బృందానికి బుధవారం మండ శాఖ నాయకులు స్వాగతం పలికారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయగౌరి, రాష్ట్ర కమిటీ నాయకులు రెడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 12వ పీఆర్సీ, డీఏలు, బకాయిలు చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేయాలన్నారు. డిమాండ్ చేశారు. దేముడు, మల్లేశ్వరరావు, రాంబాబుపాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడ్ని నియమించాలని ఆందోళన'



జీకే వీధి మండల పరిషత్ ఎదుట నిరసన తెలుపుతున్న నేలజర్త గ్రామస్థులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్త ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డీఎల్‌వో రాష్ట్ర అధ్యక్షుడు కె. మార్క్కరాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేశారు. పాఠశాల లో 103 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఐదోవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం భాష వలంటీర్, స్వచ్ఛంద వలంటీర్లతో విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. ఇకనైనా ఉపాధ్యాయుడుని నియమించకుంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామన్నారు.

పెదబయలు: మండలంలోని మారుమూల బొంగరం గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ జీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని జీఎస్‌యూ నాయకుడు మాధవరావు డిమాండ్ చేశారు. బుధవారం మూత పడిన ఈ పాఠశాలను సం దర్శించారు. మండలంలోని అనేక పాఠశాలలు ఇదే పరిస్థితిలో ఉన్నాయన్నారు. సింహచలం ఉన్నారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి



మృతి చెందిన కవి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతువలసలో ఓ విద్యార్థిని పాముకాటుకి గురై మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రి కవి(9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నది. మంగళవారం రాత్రి ఇంటిలో తల్లిదండ్రులతో కలిసి ఆమె పడుకున్నది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పాము చిన్నారి చేతిపై కాటువేసింది. వెంటనే తండ్రి రంగారావు పెదవలస ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్య సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మండల సమావేశంలో తీర్మానం



ఎంపిపి ఉషారాణికి తీర్మానం కాపీని అందజేస్తున్న సభ్యులు

అరకులోయ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు గ్రామాల్లో నిర్మించనున్న హైడ్రోపవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ, మండల సర్వ సర్వసభ్యసమావేశంలో సభ్యులంతా తీర్మానించారు. అ తీర్మానాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన నిర్వహించారు. అయితే, ఈ సమావేశం నిర్వహణలో గోప్యత పాటించారు. అలాగే, బెర్రీ బోరర్ పురుగు సోకిన కాఫీతోటలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం పెంచాలని, రెడ్‌జోన్ పరిధిలోకి వచ్చే కాఫీతోటల రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని పెదలబుడు, చినలబుడు, సుంకరమెట్ట సర్పంచ్‌లు దాసుబాబు, ఉపేంద్ర, చినబాబులు, ఎంపీటీసీ సభ్యులు శత్రుఘ్న, ఆనందరావు, భీమరాజు తదితరులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. రాజ్మా విత్తనాలు తమకు సక్రమంగా అందలేదని సుంకరమెట్టసర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చెక్‌డామ్‌ల పనుల ప్రగతిని సంబంధిత శాఖ ఏఈ వివరించారు.

గోమంగిని మండల కేంద్రం చేయాలని వినతి

పెదబయలు, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మూరుమూల గ్రామాలు అభివృద్ధికి వీ లుగా గోమంగిని ప్రత్యేక మండలంగా ఏ ర్పాటు చేయాలని గోమంగి మండల సాధన సమితి అధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వరరావు కోరారు.. బుధవారం జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబుతో కలసి స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ త్రినాధరావునాయుడులకు వినతి పత్రాలు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్, జె. సూర్యనారాయణ, కె. అనంతపద్మనాభం, నాగరాజు, సింహచలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది మహాగణపతి భారీ విగ్రహ నిమజ్జనం


వినాయక విగ్రహంపై నీటిని పిచికారీ చేస్తే మండపంలోనే నిజమజ్జనం చేస్తున్న దృశ్యం

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వర ఆలయం సమీపంలో సద్భావన ట్రస్ట్ నెలకొల్పిన 63 అడుగుల ఆది మహాగణపతి భారీ విగ్రహాన్ని బుధవారం సాయంత్రం భక్త జన సందోహం మధ్య నిమజ్జనం చేశారు. విగ్రహం ఉన్న ప్రాంతంలోనే అగ్నిమాపక శకటంతో నీరు చల్లి విగ్రహాన్ని నిర్వీర్యం చేశారు. అంతకు ముందు వినాయకునికి స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1983 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సమర్పించిన 234 కిలోల భారీ లడ్డూకు వేలంపాట నిర్వహించగా, గోవిందమ్మకాలనీకి చెందిన నాగులాపల్లి వినోద్ లక్షా 53 వేల రూపాయలకు దక్కించుకున్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం


చంద్రబాబు, లోకేశ్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఉపాధ్యాయ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపాలకు పాలతో అభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో చింతకాయల విజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 157 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్టు చెప్పారు. ఇందులో 40 శాతం మహిళలు ఉన్నారన్నారు. మెగా డీఎస్సీ ఎట్టి పరిస్థితిలోను జరక్కుండా ఉండాలని అనేక శక్తులు 140 కేసులు వేశాయని, అన్ని అవాంతరాలను అధిక మించి మెగా డీఎస్సీ తీసిన ఘనత లోకేశ్‌కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క పోస్టు తీయలేకపోయిందని విమర్శించారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

నర్సీపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ జంప నాగేంద్రరాజు, మరో పది మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ నూతన పాలక మండలి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతీ రోజు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం దేవీ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు, తనిఖీ అధికారి ఉమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ కన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా కూటమి పాలన

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు


జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలతో పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పాలన ప్రజారంజకంగా సాగుతున్నదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. మండలంలోని వెంకన్నపాలెం, గంధవరం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం జనసేనలో చేరారు. వారికి పార్టీ ఇన్‌చార్జి రాజు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అల్లం మాధవి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్పారావు, పార్టీ నాయకులు సియ్యాద్రి జగదీశ్, ఆడారి మలినాయుడు, మంగా శ్రీను, పీలా మహేశ్, గంజి శంకర్, ఏడువాక నూకరాజు, చప్పగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీజీనాథ్‌కు సన్మానం


డీజీనాథ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం. సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీజీనాథ్‌ను పీఆర్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. నర్సీపట్నంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్‌లోని వివిధ మండలాల పీఆర్టీయూ నాయకులు శాలువాలతో డీజీనాథ్ దంపతులను సన్మానించారు. ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు, కార్యదర్శి రమేశ్, నాయకులు ప్రసాద్, అల్లు అప్పారావు, ఎల్లప్పారావు, సుగుణ పాల్గొన్నారు.

అగ్గి తెగులుపై రైతులకు అవగాహన

దేవరాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంత తోట వద్ద అగ్గి తెగులుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఎల్‌వై.కాంతమ్మ బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వరికి తెగుళ్ల బెడద మొదలైందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్ వైద్య సేవలు

ప్రతీ బుధవారం అంకాలజీ వైద్యులతో ప్రత్యేక ఓపీ

ఆస్పత్రిలోనే బయాప్సీ శాంపిల్ సేకరణ, నిర్ధారణ పరీక్షలు



నర్సీపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ ఆస్పత్రిలో క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతీ బుధవారం క్యాన్సర్ ఓపీ చూస్తున్నారు. ఒకటో అంతస్తులో సూపరింటెండెంట్ గది పక్కన ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం సియాన్ క్యాన్సర్ క్లినిక్స్‌కు సంబంధించిన మెడికల్ అంకాలజిస్ట్ (క్యాన్సర్ వైద్యులు), రేడియేషన్ అంకాలజిస్ట్, శస్త్ర చికిత్స అంకాలజిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. అనుమానితులకు బయాప్సీ కూడా ఏరియా ఆస్పత్రిలోనే చేస్తారు. బయాప్సీ పరీక్షలు చేయడానికి అవసరమైన మిషన్, ఎఫ్ఎన్ఏసీ పరికరం సిద్ధం చేశారు. ప్రాథమికంగా క్యాన్సర్ వైద్య పరీక్షలకు విశాఖపట్నం వరకు వెళ్లే అవసరం ఉండదు. నోరు, గొంతు, రొమ్ము, పెద్ద పేగు, గర్భాశయం తదితర క్యాన్సర్ రోగులకు ప్రాంతీయ ఆస్పత్రిలోనే వైద్య పరీక్షలు చేస్తారు. ఇక్కడే స్ర్కీనింగ్, అవసరమైతే పెథాలజిస్ట్ డాక్టర్ అపర్ణ బయాప్సీ చేసి పరీక్ష చేస్తారు. క్యాన్సర్ నిర్ధారణ జరిగితే విశాఖపట్నం సియాన్ క్లినిక్స్‌కు తరలించి ఎన్టీఆర్ వైద్య సేవల పథకంలో క్యాన్సర్ ఏ స్టేజీలో ఉందో చూసి, దానికి అనుగుణంగా రేడియేషన్, శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారు. ప్రతీ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూస్తామని రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు


బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న బత్తుల

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు చెప్పారు. మండలంలోని వడ్డాది గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డులతో లబ్ధిదారులు సులభతరంగా రేషన్ తీసుకోవచ్చన్నారు. అక్రమాలకు తావు లేకుండా రేషన్ సరకులు పంపిణీ జరుగుతుందన్నారు. అలాగే ఇతర ప్రభుత్వ పథకాలకు కూడా వీటిని గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండా రమేశ్, మంచాల గోవింద, సయ్యపురెడ్డి మాధవరావు, కోవెల వెంకటరమణ, తలారి శంకర్, మూత్యాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులతో రేషన్ సమస్యలకు చెల్లు

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల పంపిణీకి ప్రభుత్వం తీసుకు వచ్చిన స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో సమస్యలకు తెరపడిందని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్ తెలిపారు. మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో బుధవారం స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి స్మార్ట్ కార్డులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేపట్టిన వినూత్న విధానంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం తొంగిచూస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామునాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కింతలిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి గ్రామంలో బుధవారం క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కొత్తగా వచ్చిన ఈ కార్డులతో లబ్ధిదారులకు స్కాన్ చేసి రేషన్ సరకులు పొందవచ్చునని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షైచర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమల దేవి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో 2,754 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దేవరాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రేషన్ డిపోల పరిధిలో 2754 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి బాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల వల్ల ఎక్కడైనా నిత్యావసర సరకులు పొందవచ్చని చెప్పారు. అలాగే కార్డుల ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ పురం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ, ఎస్ఐలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అక్టోబరు 4వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. బుధవారం నాతవరం, గొలుగొండ ఎస్ఐలు వై.తారకేశ్వరరావు, పి.రామారావులతో కలిసి ఏఎల్‌పురం ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. పోటీలను శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభిస్తారని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి, భోజనం తదితర సదుపాయాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. క్రీడా మైదానం పరిశీలన కార్యక్రమంలో ఎంఈవో-2.కృష్ణప్రసాద్, పేరెంట్ కమిటీ చైర్మన్ లగుడు రాజులనాయుడు, ఉపాధ్యాయులు లోచల రమేశ్, నరసింగరావు, దేముడు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

మాకవరపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దని తెలుగు యువత మండల అధ్యక్షుడు సురేశ్ సూచించారు. మండలంలోని పీపీ అగ్రహారం గ్రామంలో బుధవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ప్రతీ రైతుకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరారు. యూరియా కోసం ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

కనీస వేతనాలకు పారిశుధ్య కార్మికుల నిరసన

రోలుగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనంగా రూ.10 వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీఐటీయూ నేత ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ అరకొర వేతనాలతో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వేనాలు పెండింగ్ లేకుండా ఏ నెలకానెల చెల్లించాలని, ఐడీ కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఏరియా ఆస్పత్రిలో పది మంది రక్తదానం


శిబిరంలో రక్తాన్ని దానం చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి బ్లడ్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 10 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాళ్ల సుబ్బారావు, పాకలపాటి అరవిందరాజు, వెలగా జన్నాథరావు, చిందాడ నూకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో ప్రత్యేక వైద్య శిబిరం


బాధితులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది కొత్తూరురెల్లి వీధిలో బుధవారం ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో విష జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. మరోపక్క గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో వడ్డాది వైద్యాధికారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థిని ఎంపిక

దేవరాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని టి.ఉష రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.కల్యాణి బుధవారం తెలిపారు. ఇటీవల మండపేట అంబేడ్కర్ గురుకులంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో సత్తా చాటి ఈ పోటీల్లో స్థానం సాధించినట్టు చెప్పారు. ఎంపీపీ చింతలబుల్లిలక్ష్మి తదితరులు విద్యార్థిని ఉషను అభినందించారు.

ఉత్సాహంగా 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'


చోడవరంలో జరిగిన వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. చోడవరం మండలంలోని గవరవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో బీపీ, టీబీ, క్యాన్సర్ తదితర సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేయడంతో పాటు చిన్న పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు ప్రదీప్, దీపిక తెలిపారు. ఈ శిబిరాల్లో ఎంపీపీ గాడి కాసు, వైద్యాధికారులు మేఘన, భారతి వైద్యసిబ్బంది రవికుమార్, రత్నం, పద్మల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల వైద్యులు శ్రీనివాస్, సురేఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు నిర్వహించారు. రక్తహీనత అధిగమించేందుకు వారు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట నీలవేణి, కోన లోవరాజు, పందల దేవా, పూడి దేవా, శంకరావు, వైద్య సిబ్బంది పి.రామారావు కె.సత్తిబాబు పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో 130 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ సుంకర లక్ష్మి, డాక్టర్ కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...


మాకవరపాలెం శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నర్సీపట్నం/గొలుగొండ/మాకవరపాలెం/నాతవరం/కృష్ణాదేవిపేట: నర్సీపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గొలుగొండలో డాక్టర్ శ్యామ్‌కుమార్ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు పాల్గొన్నారు. అలాగే కృష్ణాదేవిపేటలో పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఎస్.గాయత్రి, జ్యోతి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ గజ్జలపు మనికుమారి, సర్పంచ్ లోచల సుజాత, డాక్టర్ హేమలత పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలోని బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎంపీడీవో చాయిసుధ మాట్లాడుతూ వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షరిష్మా, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, టీడీపీ మండల ఉపాధ్యాక్షుడు కేలిరెడ్డి చిరంజీవి పాల్గొన్నారు. నాతవరంమండలంలోని మర్రిపాలెం గ్రామంలో డాక్టర్ ప్రసన్న కుమార్‌తో కలసి కూటమి నాయకులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయని, మహిళలు వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ నాయకుడు గవిరెడ్డి త్రినాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ: మాడుగుల నియోజకవర్గం పరిధిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కింతలి గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు సోముదొర, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ భవాని, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిరావు, దేముడు పాల్గొన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శ్రీలక్ష్మి, కోటేశ్వరరావు, రమ, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, సర్పంచ్ భవాని పాల్గొన్నారు. దేవరాపల్లి 324 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు డాక్టర్ పూజిత మేఘన తెలిపారు. రేడియాలజిస్ట్ హేమలత, వైద్యురాలు వనజ, పుష్పరాజు, ఆనంద్ పాల్గొన్నారు. చీడికాడ మండల కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు.


సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతో మేలు: ఏడీఏ శ్రీదేవి

రోలుగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ఎంతో మేలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి సూచించారు. మండలంలోని కొమరవోలు గ్రామంలో బుధవారంనానో యూరియా, వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించాలని సూచించారు. డ్రోన్ వినియోగంతో కూలీల కొరత తగ్గించవచ్చున్నారు. గంట నుంచి రెండు గంటల్లో చేసే పనిని ఆరు నుంచి పది నిమిషాల్లోనే డ్రోన్ల ద్వారా ఎరువులు పిచికారీ చేయవచ్చునని ఆమె చెప్పారు. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నయంగా జీవన ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

30న సత్యశోదక్ మహాసభ

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించి 152 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న విజయనగరం జిల్లా కొత్తవలసలో సత్యశోదక్ మహాసభ నిర్వహిస్తున్నట్టు దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద బుధవారం సత్యశోదక్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి సంఘం నాయకులు సన్యాసమ్మ, వరలక్ష్మి, హుస్సేన్, బోడయ్య. చిన్నారావు, మోతి. దావూద్, రాజబాబు, మస్తాన్, మదీనా, పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పికొండమ్మ జాతర



కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేట గ్రామ దేవత అప్పికొండమ్మ జాతరను గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ పందిరి సత్యంనాయుడు తెలిపారు. ఇప్పటికే ఆలయ రహదారికి ఇరువైపులా విద్యుత్ అలంకరణతో పాటు అమ్మవారి విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేసినట్టు చెప్పారు. సాయంత్ర పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. జాతరకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

ఎంపీడీవోగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకారం

నాతవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా ఎం.ఎస్.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామా కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా కృష్ణారావు, స్థానిక నేత ఎస్.వెంకటరమణ ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రావికమతం ఎంపీడీవోగా మహేశ్..

రావికమతం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఒ.మహేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలోనూ మహేశ్ ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వెంకన్నబాబు ఉద్యోగ విరమణ పొందారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామస్వామి నుంచి మహేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పైల రాజు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా శివప్రసాద్..

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా శివప్రసాద్ నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరంలో ఏవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికి వచ్చారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, కార్యదర్శులు ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కామాక్షీదేవి వీరబ్రహ్మేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వృత్తి రీత్యా ఎక్కువ వయస్సు కలిగిన పలువుర్ని ఈ సందర్భంగా శాలువాలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామాక్షిదేవి వీరబ్రహ్మేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం నాయకులు వి.వీరబాబు, నాగేశ్వరావు, టి.శివ, వరప్రసాద్, తాతాజీ, శివ తదితర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణంలో అగ్ని ప్రమాదం

ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దగ్ధం

చోడవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తూరు జంక్షన్ సమీపంలో సీతారామ కాంప్లెక్స్‌లోని ఉషశ్రీ ఎలక్ట్రానిక్ ఉపకరణాల దుకాణంలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని విలువైన ఉపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఉదయం దుకాణం నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణంలోని విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కాలిపోయాయి. ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

చీడికాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బపాలెం పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం బుధవారం రైతులు పడిగాపులు కాశారు. సొసైటీకి యూరియా తక్కువ రావడంతో ఎంత మందికి అందుతుందోనన్న ఆందోళనతో రైతులు నిరీక్షించారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 8 గంటలకు వచ్చి డాక్యుమెంట్లు పూర్తిచేసి రశీదులు అందించారు. ఒకానొక దశలో రైతులు తోపులాటకు దిగారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కృష్ణవేణి మాట్లాడుతూ, దిబ్బపాలెం సచివాలయం పరిధిలో 50 బస్తాలు వచ్చాయని, గురువారం నుంచి రైతులకు యూరియా అందజేస్తామని తెలిపారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రికి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

విశాఖలో సీఎం పర్యటన

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం విశాఖలో బిజీగా గడిపారు. ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్‌లో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం సాగరిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల స్టాల్స్‌ను పరిశీలించారు. సాయంత్రం రాడిసన్ బ్లూ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. కాగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జీఎస్టీ సదస్సులో ప్రసంగించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



ఎలమంచిలి వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఎలమంచిలిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్థానికులతో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ స్ఫూర్తిదాయకమైన పాలనతో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచాలి

... 5వ పేజీ తరువాయి

జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, డీఐవో డాక్టర్ లూసీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా భద్రతలో విశాఖ టాప్

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. అదేవిధంగా భోగాపురంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం వచ్చే వచ్చే ఏడాది ఆగస్టు నుంచి ఆపరేషన్లు ప్రారంభిస్తుందన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు జీఎంఆర్‌ను, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అనుసంధానం చేశామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల తయారీలో అది కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. విశాఖపట్నానికి మెట్రో రైలును తీసుకురావడానికి కృషిచేస్తున్నామని చెప్పారు.

అక్రమ లేఅవుట్‌లపై కొరడా

... 5వ పేజీ తరువాయి

క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. క్రమబద్ధీకరణకు 90 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. రియల్టర్లతోపాటు అనధికార లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసినవారు, 2020 ఎల్ఆర్ఎస్ సమయంలో దరఖాస్తు చేయనివారు ఈసారి దరఖాస్తు చేసుకొనే అవకాశం కలిగింది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్ణయించిన చార్జీలకే ఇప్పుడు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే క్రమబద్ధీకరణకు చాలా మంది లేఅవుట్ యాజమానులు ముందుకు రావడం లేదని తెలిసింది. ప్రభుత్వం విధించిన గడువులో ఇప్పటికే సగం రోజులు గడిచినప్పటికీ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు అంతంతమాత్రంగానే అందాయని సమాచారం.

సద్వినియోగం చేసుకోవాలి: డీపీవో సందీప్

అనధికార లేఅవుట్‌లు, ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అనధికార లేఅవుట్‌లను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశాం. నిర్ణీత గడువులోగా స్పందించకపోతే లేఅవుట్లలో సరిహద్దు రాళ్లను తొలగిస్తాం. స్థలాల రిజిస్ట్రేషన్‌లను నిలుపుదల చేయిస్తాం. వీఎంఆర్‌డీఏ అనుమతి వున్న రియల్ ఎస్టేట్ వెంచర్లలో మాత్రమే స్థలాలు కొనుగోలు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి.

గోవాడ షుగర్స్ పరిరక్షణకు ఆందోళన ఉధృతం చేస్తాం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించేంత వరకు పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన మోహనరావు, నందారపు భాస్కరరావు, కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు, సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, తనకల జగన్, గండి నాయనిబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, వనం సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలస

... 5వ పేజీ తరువాయి

సభ్యుడు బైపా శ్రీనివాసరావు, ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, కర్రివానిపాలెం సర్పంచ్ కర్రి వరహాలరావు, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కొంకుపూడి రామకృష్ణతోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మురికుర్తి గంగరాజులకు మంత్రి అనిత పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన చూసి వైసీపీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మరో 20 ఏళ్లు కూటమే గెలుస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులంతా గెలవడమే తన లక్ష్యమని అనిత అన్నారు. టీడీపీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకే వుందని, టీడీపీ క్రమశిక్షణగల పార్టీ అని, ఈ కారణాల వల్లనే ఈ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. వైసీపీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పనిచేసిన తనకు అవమానం తప్ప ఎటువంటి గౌరవం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, సీనియర్ నాయకులు యేజర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్దం, ఎన్.వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళ.. కుటుంబానికి పునాది

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి
- 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభం



గర్భిణులకు సీమంతాలు చేసిన దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి బలమైన పునాది అని ఐసీడీఎస్ పీడీ డి. సూర్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ భవనంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు, స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీ జ్యోతి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన కార్యక్రమం ద్వారా 15 రోజులపాటు మహిళలకు ఉచిత వైద్యం, మందులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. ఎస్ఎన్ఎస్‌పీఏ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరంలో ఇమ్యునైజేషన్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నోడల్ అధికారి డాక్టర్ ఎల్‌బీఎస్‌హెచ్ దేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, వైద్యులు ప్రశాంతి, చంద్రశేఖర్‌దేవ్, ఎస్తేరురాణి, క్రాంతి, కె.లావణ్య పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల్లో ఉత్సాహం

- కొన్ని ఇబ్బందులున్నా ప్రజలకు మేలు చేసే క్రమంలో ముందుకు వెళ్లాల్సిందే..
- కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సంస్కరణలను ప్రకటించిన వెంటనే అన్ని వర్గాల ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ అన్నారు. బుధవారం పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌లో నెక్ట్స్ జనరేషన్ జీఎస్టీ రీఫార్మ్స్ పేరుతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరైన ఆమె వివిధ వర్గాలకు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధి కంకటాల మల్లిక్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు ఆనందంగా ఉన్నారని, ఈ మార్పులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కావాల్సి ఉందన్నారు. నూతన మార్పులను అమలు చేసేందుకు కొంత సమయం కావాలన్నారు. రూ.2,500 కంటే ఎక్కువ ధర ఉన్న వస్త్రాలను 18 శాతం స్లాబ్‌లో పెట్టారని, వివాహాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో కొనుగోలు చేసే వస్త్రాలకు అది పెద్ద బడ్జెట్ కాదని, దీనిపై ఆలోచించాలన్నారు. ఇందుకు మంత్రి సీతారామన్ మాట్లాడుతూ దేశంలో కోట్లాది మంది ప్రజలకు మేలు జరుగుతున్నప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు ఉంటాయని, అయినా ముందుకు వెళ్లాలన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తరువాత రోజు నుంచే వాటిని అమలు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. సిమెంట్ పరిశ్రమకు చెందిన రాజశేఖర్ మాట్లాడుతూ సిమెంట్‌ను 28 నుంచి 18 శాతం స్లాబ్‌కు మార్చడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు సంబంధించిన సాంకేతిక ఇబ్బందులను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్య రంగానికి చెందిన ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ వ్యక్తిగత ఇన్సూరెన్స్‌లకు సంబంధించి స్లాబ్‌లను జీరో చేశారని, గ్రూపు పాలసీలకు కూడా ఇదే తరహా నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.

బ్రాండిక్స్‌కు భరోసా

- కర్మాగారం ఉపశమన చర్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి హామీ
- సంస్థ భారత భాగస్వామి దొరస్వామి



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న దొరస్వామి

అచ్యుతాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికా టారిఫ్‌లతో కష్టాల్లో ఉన్న తమ కర్మాగారం ఉపశమన చర్యలకు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. బుధవారం ఆయన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌తో కలిసి కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే 25 శాతం టారిఫ్‌ల కారణంగా ఎగుమతులు కష్టతరంగా మారాయని, తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన మరో 25 శాతం టారిఫ్‌లతో భారత టెక్స్‌టైల్ రంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. దీని వలన అమెరికా మార్కెట్‌తో పోటీ పడడం దాదాపు అసాధ్యమైందని, దీని ప్రభావం ఉద్యోగులపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి లభించిన సహాయ భరోసాను కూడా కేంద్ర మంత్రి వద్ద ప్రస్తావించామని ఆయన తెలిపారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంస్థకు మద్దతు ప్రకటించి దేశీయ మార్కెట్ అవకాశాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై నిర్మలా సీతారామన్ స్పందిస్తూ అమెరికా 50 శాతం టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో అపెరల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం సీరియస్‌గా పరిగణిస్తోందని, ముఖ్యంగా వేలాది మంది గ్రామీణ మహిళలు, యువతకు ఉపాధి కల్పిస్తున్న బ్రాండిక్స్ ఇండియా వంటి సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

బురదలో కూరుకుపోయిన భారీ వాహనం

- నర్సీపట్నం- వడ్డాది మధ్య నిలిచిన రాకపోకలు



బంగారుమెట్ట జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో కూరుకుపోయిన డంపర్ లారీ

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బంగారుమెట్ట జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి బండరాళ్లను రవాణా చేస్తున్న భారీ డంపర్ లారీ గోతిలో కూరుకుపోయింది. దీని పక్క నుంచి వెళుతున్న మరో వ్యాన్ కూడా అక్కడే బురదలో దిగబడిపోవడంతో వడ్డాది-నర్సీపట్నం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొంతసేపటి తరువాత స్థానికులు, వాహనదారులు కలిసి వ్యాన్‌ను బురదలో నుంచి బయటకు తీశారు. బండరాళ్ల లారీ అక్కడే వుండిపోయింది. పోలీసులు బుధవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌ను రప్పించి, గోతిలో కూరుకుపోయిన బండరాళ్ల లారీని బయటకు తీయించారు.

వైద్య విద్యార్థిని ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో జరిగింది. పెందుర్తి ఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాల మేరకు...

మాకవరపాలేనికి చెందిన చింతల దేవుడు, గౌరి దంపతుల కుమార్తె శివాని జ్యోత్స్న (21) తగరపువలసలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రథమ సంవత్సరంలో బ్యాగ్‌లాగ్స్ ఉండిపోయాయి. వాటిని క్లియర్ చేయడంలో భాగంగా చదువుకునేందుకు ఈనెల 15న సుజాతనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ నివసిస్తున్న తన మేనమామ ఇంటికి వచ్చింది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ముభావంగానే ఉండేది. బ్యాక్‌లాగ్స్ గురించి ఆలోచిస్తూ తీవ్ర ఒత్తిడితో ఆందోళన చెందుతుండేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఏడు గంటలకు చదువుకుంటానంటూ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లింది. కొంతసేపటి తరువాత టెర్రస్ మీద నుంచి కిందకు దూకేసింది. పెద్ద శబ్దం రావడంతో సెల్లార్‌లో వాకింగ్ చేస్తున్న వారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తలకు తీవ్రగాయంతో రక్తసిక్తమైన యువతిని శివానిగా వాచ్‌మన్ గుర్తించాడు. వెంటనే పెందుర్తి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన టీడీపీ జిల్లా నేతలు



విమానాశ్రయంలో సీఎం చంద్రబాబును కలిసిన కార్పొరేషన్ల చైర్మన్లు మళ్ల సురేంద్ర, ప్రగడ నాగేశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ

అనకాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బుధవారం విశాఖపట్నం విమానాశ్రయంలో జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

క్రైం... crime news

రైలు ఎక్కుతూ జారిపడిన విద్యార్థి మృతి

పాయకరావుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): తుని రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... పాయకరావుపేట మండలం పాయకరావుపేట మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన గరికిన హేమన్‌రాజు(19) కాకినాడ జిల్లా సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లేందుకు తుని రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. చేపలవేటపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న హేమన్‌రాజు తండ్రి రామకృష్ణ తన శక్తికి మించి కొడుకుని చదివిస్తున్నాడని, కుమారుడి మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి

హేమన్‌రాజు రైలు ప్రమాదంలో మృతి చెందడం పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీ వీరాభిమాని అయిన ఇతని ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. కుటుంబానికి ప్రభుత్వపరంగా, పార్టీపరంగా అన్ని విధాలా సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రియుడితో గొడవపడి యువతి ఆత్మహత్య

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సహజీవనం చేస్తున్న ప్రియుడితో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం రాత్రి పాత రేసపువానిపాలెంలోని ఓ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకుని బలన్మరణానికి పాల్పడింది. ఇందుకు సంబంధించి త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరం దరి సైతారుపేటకు చెందిన కర్రి నిస్సీగ్రేస్ (19) నగరంలోని జేడీ ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి సాల్మన్‌రాజ్ చర్చ్‌ఫాదర్‌గా ఉన్నారు. కాగా చింతపల్లికి చెందిన రేమాల ఉపేంద్ర , నిస్సీగ్రేస్ ప్రేమించుకున్నారు. ఉపేంద్ర నగరంలోని ఓ బ్యాంక్ ఏటీఎం మిషన్‌లలో నగదు పెట్టే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నిస్సీగ్రేస్, ఉపేంద్ర పాత రేసపువానిపాలెంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ప్రేమికులిద్దరూ గొడవపడ్డారు. దీంతో నిస్సీగ్రేస్‌పై కోపంతో ఉపేంద్ర ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం ఓ గంట తర్వాత తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి నిస్సీగ్రేస్ మెడకు చీరతో ఉరి బిగించుకొని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన ఉపేంద్ర వెంటనే ఆమెను కిందకు దింపి స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరీక్షించి ఆమె మృతిచెందినట్టు తెలిపారు. ఈ విషయమై ఉపేంద్ర మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సిగ్రేస్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసగించి అత్యాచారానికి పాల్పడిన సింగన శ్రీను అనే యువకుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. అడ్డరోడ్డులో గల నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి అత్యాచారం చేశాడంటూ మంగళవారం ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సింగన శ్రీను అనే యువకుడిపై అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ఆ యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

ఆరు గంజాయి కేసుల్లో నిందితుడి అరెస్టు

రావికమతం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరు గంజాయి కేసుల్లో నిందితుడిగా వుండి, గత ఎనిమిదేళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు తెలిపారు. 2016-17 సంవత్సరంలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట పోలీస్ స్టేషన్లలో నమోదైన గంజాయి రవాణాకు సంబంధించి నాలుగు కేసుల్లో నిందుడైన కాకినాడకు చెందిన కొరపకాల కుమారస్వామి నివాసాన్ని తరచూ మారుస్తూ తపించుకు తిరుగుతున్నాడని ఆయన చెప్పారు. అంతకు ముందు కాకినాడ, పెందుర్తి పోలీస్టేషన్లలో కూడా రెండు గంజాయి కేసులువున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఒక పెంట్రోల్ బంకులో పని చేస్తున్న కుమారస్వామిని సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఇక్కడకు తీసుకువచ్చి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్య

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడిసిన్ విద్యార్థి ఒకరు కళాశాల హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పీఎంపాలెం ఎస్ఐ భాస్కర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌కు చెందిన విస్మాద్‌సింగ్ (20) నగరంలోని ఒక ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇక్కడే హాస్టల్ ఆరో అంతస్థులో ఉంటున్నాడు. బుధవారం పదో అంతస్థుకు వెళ్లి, అక్కడి నుంచి కిందకు దూకేశాడు. ఇది చూసిన సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయమవ్వడంతో అప్పటికే మృతిచెందాడు. చదువు ఒత్తిడి తట్టుకోలేక, లోకం విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్టు పంజాబీ భాషలో రాసిన లేఖ హాస్టల్‌లోని అతడి గదిలో లభించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి హిమాచల్‌ప్రదేశ్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నారని, ఆయనకు సమాచారం అందించామని కళాశాల యాజమాన్యం తెలిపింది.

రాచపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు

... 5వ పేజీ తరువాయి

విద్యుత్తు, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ కాలువల వంటి సదుపాయాలను త్వరగా కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులతో మాట్లాడారు. పునరావాస కాలనీకి రావడానికి అంగీకారమేనా? అని యువరాజ్ అడగ్గా.. అన్ని సదుపాయాలు కల్పిస్తే రావడానికి అభ్యంతరం లేదని అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉపసర్పంచ్ గంటా నరసింగరావు చెప్పారు. వీరి వెంట నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, కూటమి నాయకులు వున్నారు.

జాలారిపేటలో మహిళ దారుణ హత్య

... 5వ పేజీ తరువాయి

బయటకు వచ్చాడు. తరువాత ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన ఒక యువతితో సహ జీవనం సాగించాడు. కొద్ది రోజుల తరువాత ఇతని వేధింపులు తట్టుకోలేని ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం పరవాడలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మి (45)కి కోదండతో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల తరువాత ఆమెను జాలారిపేటలోని తన ఇంటికి తీసుకొచ్చి సహజీవనం చేయడం మొదలుపెట్టాడు. లక్ష్మి హోటల్‌లో పనిమానేసింది. ఇద్దరూ కూలీ పనులకు వెళుతున్నారు. కోదండ మద్యానికి బానిసై లక్ష్మితో తరుచూ గొడవ పడుతున్నాడు. బుధవారం కూడా మద్యం సేవించి ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో చాకు తీసుకుని లక్ష్మిపై విచక్షణా రహితంగా దాడిచేసి పొడిచాడు. కర్రతో బలంగా తలపై కొట్టాడు. దీంతో ఆమె మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు సీఐ మల్లికార్జునరావు, సిబ్బందితో జాలారిపేట వెళ్లారు. నిందితుడు కోదండను అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559